www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 29 జనవరి 2024

5

పశ్చిమ గోదావరి

పేరుపాలెం బీచ్‌లో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం బీచ్‌లో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. బీచ్‌కు ప్రకృతి ప్రేమికులు, పర్యాటకులు ప్రత్యేక ద్విచక్రవాహనాల్లో ఉదయమే తరలివచ్చారు. పలువురు సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు. చిన్నారులు ఇసుక తెన్నెలపై ఒడ్డుకు కొట్టుకు వస్తున్న కెరటాలతో ఆటలాడుకున్నారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సరివి కొబ్బరి తోటల్లో సహపంక్తి భోజనాలు చేసి సేద తీరారు.

బీచ్‌లో పర్యాటకుల సందడి

అభ్యర్థులను తేల్చండి..!

- టిడిపి, జనసేన నాయకుల్లో తీవ్ర చర్చ
- తేలని ఎంఎల్‌ఎ, ఎంపీ అభ్యర్థుల పేర్లు
- జనసేనకు కేటాయించే సీట్లపైనా ఊహాగానాలే
- ముమ్మరంగా వైసిపి అభ్యర్థుల ప్రచారం
- వెనుకబడిపోతామంటున్న టిడిపి, జనసేన నాయకులు

ఎన్నికల సమయం దగ్గర పడుతున్నా పోటీచేసే అభ్యర్థుల పేర్లను ప్రకటించకుండా టిడిపి, జనసేన అధినాయకులు చేస్తున్న నాన్చుడిధోరణిపై కిందిస్థాయిలో తీవ్ర చర్చ కొనసాగుతోంది. పోటీకి దిగే అభ్యర్థులపై వైసిపి చాలా వరకూ స్పష్టత ఇవ్వడంతో అభ్యర్థులంతా జనాల్లో తిరుగుతూ ఎన్నికల ప్రచారంలో మునిగితేలుతున్నారు. టిడిపి, జనసేన మాత్రం అభ్యర్థులను తేల్చకపోవడంతో ప్రచారంలో తాము వెనుబడిపోయే పరిస్థితి ఏర్పడనుందన్న ఆందోళనలో ఇరుపార్టీల్లోని ఆశావహులంతా తీవ్ర కలత చెందుతున్నారు.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో 14 అసెంబ్లీ నియోజకవర్గాలు, రెండు పార్లమెంట్ స్థానాలు ఉన్నాయి. ప్రస్తుతం రెండు జిల్లాలో ఉన్న స్థానాల్లో 12 మంది వైసిపి ఎంఎల్‌ఎలు, రెండు చోట్ల టిడిపి ఎంఎల్‌ఎలు 2019 ఎన్నికల్లో గెలిచారు. ఏప్రిల్ రెండో వారంలో సాధారణ ఎన్నికలు జరిగే అవకాశం ఉందని, ఫిబ్రవరి నెలఖారుగానీ, మార్చి మొదటివారంలోగానీ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని స్పష్టంగా అర్థమవుతోంది. అభ్యర్థుల ఎంపికలో అధికారపార్టీ వైసిపి కొంత వేగంగా ముందుకు సాగగా, ప్రతిపక్ష పార్టీలు పొత్తులో భాగంగా ఉన్న టిడిపి, జనసేన మాత్రం నాన్చుడి ధోరణి అవలంబిస్తున్నాయన్న చర్చ ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల్లో సాగుతోంది. ఇప్పటికే వైసిపి పోలవరం, చింతలపూడి నియోజకవర్గాలకు సంబంధించి సిటింగ్ ఎంఎల్‌ఎలను మార్చి కొత్తవారి పేర్లను ప్రకటించింది. ఇక మిగిలిన 12 నియోజకవర్గాల్లోనూ సిటింగ్‌లనే బరిలోకి దింపనున్నట్లు దాదాపుగా తేల్చేసింది. మార్పులు, చేర్పులు వంటివి ఉన్నా ఒకటి, రెండు స్థానాల్లో మినహా ఇక ఉండవన్న సంకేతాలు సైతం ఇచ్చేసింది. దీంతో వైసిపి అభ్యర్థులంతా తమ నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం ముమ్మరం చేశారు. స్థానిక నాయకులను, జనాలను కలుస్తూ, ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు.

సీట్లు తేల్చరు.. అభ్యర్థులను ప్రకటించరు..

వైసిపి అభ్యర్థులు ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండగా టిడిపి, జనసేనలో మాత్రం ఆ పరిస్థితి లేకుండా పోయిందన్న భావన వ్యక్తమవుతోంది. రెండు జిల్లాలో కాపు సామాజిక తరగతి ఓట్లు ఎక్కువగా ఉన్న పరిస్థితి ఉంది. పొత్తులో ఉన్న జనసేనకు ఎన్ని సీట్లు కేటాయిస్తారనే దానిపై ఇప్పటికే ఊహాగానాలు నడుస్తున్నాయి. రెండు జిల్లాలో ఉన్న 14 అసెంబ్లీ స్థానాల్లో సగం సీట్లు జనసేనకు ఇస్తారని ప్రచారం సాగుతుండగా, నాలుగు స్థానాల్లో జనసేన పోటీచేస్తుందని మరో ప్రచారం సాగుతోంది. కేటాయించే స్థానాలపైనా అనేక రకాల ప్రచారాలు నడుస్తున్నాయి. నరసాపురం, భీమవరం, తాడేపల్లిగూడెం, ఉంగుటూరు, ఏలూరు నియోజకవర్గాలు జనసేనకు కేటాయిస్తారని చర్చనడుస్తుండగా, మార్పులు ఉంటాయంటూ మరో రకమైన చర్చ కొనసాగుతోంది. ఇలా అసెంబ్లీ సీట్ల కేటాయింపులో టిడిపి, జనసేన అధినాయకత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో కిందిస్థాయి క్యాడర్‌లో అయోమయం నెలకొంది. చింతలపూడి, పోలవరం నియోజవర్గంలో ఎంఎల్‌ఎ అభ్యర్థిగా పోటీ చేసేందుకు టిడిపి నుంచి ఆశావహుల జాబితా ఎక్కువగానే ఉంది. బరిలో ఉండే అభ్యర్థులను మాత్రం టిడిపి తేల్చలేదు. ఏలూరులో టిడిపి నుంచి బడేటి చంటి, జనసేన నుంచి రెడ్డి అప్పలనాయుడు నియోజకవర్గ ఇన్‌ఛార్జులుగా ఉన్నారు. బడేటి బుజ్జి భార్య టిడిపి అభ్యర్థిగా ఉండే అవకాశం ఉందని ప్రచారం సాగుతోంది. ఎవరు పోటీ చేస్తారనే దానిపై క్యాడర్‌లో అయోమయం నెలకొంది. ఉంగుటూరులో టిడిపి నుంచి గన్ని వీరాంజనేయులు, జనసేన నుంచి పెనుమత్స ధర్మరాజు నియోజకవర్గ ఇన్‌ఛార్జులుగా ఉన్నారు. అయితే వట్టి వసంత్‌కుమార్ సోదరుడు కుమారుడు వట్టి పవన్ పేరు కొత్తగా వినిపిస్తోంది. తాడేపల్లిగూడెంలో జనసేన పోటీచేస్తుందో, టిడిపి చేస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. భీమవరం నుంచి జనసేన అధినేత పోటీచేస్తారో లేదో స్పష్టత లేదు. కైకలూరు, న్యూజివీడు, తణుకు, నరసాపురం, ఉండి ఇలా ఏ ఒక్క నియోజకవర్గంలోనూ టిడిపి, జనసేన నుంచి ఎవరు పోటీచేస్తారనే దానిపై స్పష్టత లేకపోవడంతో ఇరుపార్టీల నాయకుల్లో కొంత నిర్వేదం నెలకొంది. దీంతో అభ్యర్థులను తేలిస్తే ప్రచారం చేసుకుంటామంటూ టిడిపి, జనసేన నాయకుల్లో చర్చ కొనసాగుతోంది.

ఎంపీ అభ్యర్థులపైనా అంతే..

ఏలూరు, నరసాపురం రెండు పార్లమెంట్ స్థానాల అభ్యర్థుల ఎంపికలోనూ టిడిపి, జనసేన ఇంకా స్పష్టతకు రాలేదు. వైసిపి నుంచి ఏలూరు ఎంపీగా కారుమూరి సునీల్ కుమార్ యాదవ్, నరసాపురం నుంచి గుబ్బల తమ్మయ్య పోటీ చేయనున్నట్లు స్పష్టత వచ్చింది. రెండు ఎంపీ స్థానాల్లో ఒకటి జనసేనకు కేటాయిస్తారా, లేక రెండు చోట్ల టిడిపి అభ్యర్థులే పోటీచేస్తారా అనేది ఇప్పటికీ తేలలేదు. ఏలూరు నుంచి బిసి అభ్యర్థిని పోటీలోకి దింపుతారని ప్రచారం సాగుతున్నా స్పష్టత మాత్రం లేదు. నరసాపురం నుంచి ప్రస్తుత వైసిపి ఎంపీ రఘు రామకృష్ణంరాజు మళ్లీ టిడిపి నుంచి పోటీ చేయనున్నట్లు ప్రచారం సాగుతున్నా స్పష్టమైన ప్రకటన మాత్రం లేకుండా పోయింది. దీంతో టిడిపి, జనసేన అధిష్టానం తీరుపై క్యాడర్‌లో తీవ్ర అసంతృప్తి నెలకొంది.

రోడ్ల పనులకు శంకుస్థాపన చేస్తున్న శాసనమండలి ఛైర్మన్ మోషేనురాజు

శరవేగంగా రహదారి అభివృద్ధి పనులు

శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు

ప్రజాశక్తి - పోడూరు

రాష్ట్రంలో రహదారుల అభివృద్ధి పనులు శరవేగంగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు అన్నారు. కవిటం గ్రామంలో ఆదివారం ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆధ్వర్యంలో మోషేనురాజు ముఖ్యఅతిథిగా హాజరై ప్రభుత్వ నిధులు రూ.25 కోట్లతో చేపట్టిన పాలకొల్లు మార్టేరు - రహదారి విస్తరణ, అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శాసనమండలి ఛైర్మన్ మోషేనురాజు మాట్లాడుతూ గ్రామాలాభివృద్ధి, పేద ప్రజల సంక్షేమం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డితోనే సాధ్యమన్నారు. రాష్ట్రంలో ప్రజలందరూ జగన్మోహన్‌రెడ్డిని ఆదరిస్తున్నారనీ, రానున్న అసెంబ్లీ ఎన్నికల తర్వాత సిఎం జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు మాట్లాడుతూ పాలకొల్లు - మార్టేరు రహదారి అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. ఇప్పటికే కవిటం - గుమ్మలూరు రహదారిని ప్రభుత్వ నిధులు రూ.3 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపి, జెడ్‌పిటిసి సభ్యులు గుంటూరి పెద్దిరాజు, సర్పంచులు చుట్టుగుళ్ల పూర్ణిమ, శెట్టిబత్తుల సువర్ణరాజు, వైస్ ఎంపిపి ఇందుకూరి సీతారామరాజు, గ్రామ కమిటీ అధ్యక్షుడు అంబళ్ల భాస్కరరావు, దేవస్థానం ఛైర్మన్ పోడూరి సత్యసాయిబాబా, ఎంపిటిసి కుక్కల సూరిబాబు పాల్గొన్నారు.

ప్లెక్సీ చింపిన వారిపై అట్రాసిటీ కేసు నమోదుచేయాలి

కెవిపిఎస్, దళిత సంఘాల ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - పెనుగొండ

మండలంలోని వడలి గ్రామంలో అంబేద్కర్ ఫ్లెక్సీ చింపిన వారిపై ఎస్‌సి, ఎస్‌టి, అట్రాసిటీ కేసు నమోదు చేసి, వారిని అరెస్టు చేయాలని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బత్తుల విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం వడలిలో దళిత సంఘాలు, కెవిపిఎస్ ఆధ్వర్యంలో దళితులు రహదారిపై ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ అధ్యక్షుడు బత్తుల విజయ్‌కుమార్ మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి నేటికి 75 సంవత్సరాలైనా దళితులపై దాడులు రోజురోజుకూ పెరిగిపోతున్నాయన్నారు. వడలిలో అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా దళితపేటకు వచ్చే దారిలో ఫ్లెక్సీ పెట్టుకుంటే కొంతమంది ఆ ఫ్లెక్సీని చింపి గందరగోళం సృష్టించారన్నారు. అధికారులు తక్షణం స్పందించి గ్రామంలో శాంతిభద్రతలు నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మండల కార్యదర్శి కప్పల రత్నరాజు, వడ్డీ ప్రసాద్, బుడితి బాబు, ఉటాల రాజశేఖర్, సంఘం పెద్దలు, దళితులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న దళితులు, నేతలు

రాజమండ్రి సభకు తరలిన ఉపాధ్యాయులు

పాత పెన్షన్ విధానాన్ని ప్రకటించే వారికే మద్దతు : యుటిఎఫ్

ప్రజాశక్తి - భీమవరం

యుటిఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఓట్ ఫర్ ఒపిఎస్ సభకు జిల్లా నుంచి యుటిఎఫ్ నేతలు, ఉపాధ్యాయులు రాజమండ్రి ఆదివారం భారీగా తరలివెళ్లారు. జిల్లా వ్యాప్తంగా 13 బస్సులు, 50 కార్లలో యుటిఎఫ్ నేతలు, ఉపాధ్యాయులు సుమారు వెయ్యి మంది వెళ్లారు. రోడ్డు మార్గాన దారి పొడవునా సిపిఎస్ రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని ప్రభుత్వం ఉపాధ్యాయుల పట్ల అవలంభిస్తున్న వ్యతిరేక విధానాలపై నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పిఎస్.విజయరామరాజు, ఎకెవి.రామభద్రం మాట్లాడారు. పాదయాత్ర సమయంలో ప్రతిపక్షంలో ఉన్న జగన్ వారం రోజుల్లో సిపిఎస్‌ను రద్దు చేస్తామని చెప్పిన హామీని అమలు మరిచారన్నారు. దీనిపై మాట్లాడితే నిర్బంధించడం, పోరాడితే అక్రమ కేసులు పెట్టడం వంటి దుశ్చర్యకు వైసిపి ప్రభుత్వం పాల్పడడం అత్యంత దుర్మార్గమన్నారు. దఫాదఫాలుగా ఆందోళనలు చేస్తున్నప్పటికీ కనీసం ప్రభుత్వం పట్టించుకోకుండా ఉపాధ్యాయుల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులతో వైరాన్ని పెంచుకున్న ఏ ప్రభుత్వం చరిత్రలో ప్రజాక్షేత్రంలో నిలవలేదన్న విషయాన్ని వైసిపి ప్రభుత్వం గుర్తు తెచ్చుకోవాలన్నారు. కాదు కూడదని నియంతల వ్యవహరిస్తే రానున్న ఎన్నికల్లో వైసిపి నామ రూపాలు లేకుండా కాలగర్భంలో కలిసిపోతుందన్నారు. పాత పెన్షన్ విధానాన్ని ప్రకటించే రాజకీయ పార్టీలకే తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ఎన్నికల వేళ హడావిడి హామీ ఇవ్వకుండా రాజకీయ పార్టీలు స్పష్టమైన హామీని ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాజమండ్రి సభకు తరలివెళ్తున్న ఉపాధ్యాయులు, నేతలు

పేదల అభ్యున్నతికి కృషి

శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు

ఆచంట (పెనుమంట్ర) : వైసిపి ప్రభుత్వంలో సిఎం జగన్ పేద బడుగు బలహీనులకు పెద్దపీట వేస్తున్నట్లు శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషన్‌రాజు అన్నారు. పెనుమంట్ర మండలంలో ఆదివారం కోడూరు గ్రామపంచాయతీ పరిధిలో రూ.88.34 లక్షలతో నిర్మించిన వివిధ అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. రూ.43.60 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని, రూ.23.94 లక్షలతో నిర్మిం చిన రైతు భరోసా కేంద్రాన్ని, ఎంఎల్‌ఎ చెరుకు వాడ శ్రీరంగనాథరాజు రూ.20.80 లక్షలతో నిర్మిం చిన వెల్‌నెస్ సెంటర్‌ను జెడ్‌పి చైర్‌పర్సన్ గంట పద్మశ్రీ ప్రారంభించారు. వెలగలేరులో రూ.25 లక్షల తో నిర్మించిన సచివాలయాన్ని, రూ.24 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, ఆలమూరు పంచాయతీ కోమటి చెరువులో జగనన్న కాలనీలో రూ.25 లక్షలతో నిర్మించిన పాఠశాలను, ఆలమూ రులో రూ.25 లక్షలతో నిర్మించిన ఎస్‌సి కమ్యూనిటీ భవనాన్ని, రూ.85 లక్షలతో నిర్మించిన సీసీ డ్రెయిన్‌ను పంట కాలువ నిర్మాణ పనులను ప్రారంభించారు.

పాలకొల్లు సిఐగా మంగాదేవి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు పట్టణ సిఐగా కె.మంగాదేవి ఆదివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన డి.రాంబాబు ఏలూరుకు బదిలీ అయ్యారు. ఆమె కోనసీమ జిల్లా నుంచి బదిలీపై పాలకొల్లు విచ్చేశారు. ఆమెకు పట్టణ ఎస్‌ఐలు బాదం శ్రీనివాస్, ముత్యాలరావు, ఎఎస్‌ఐ ఏసుబాబు సిబ్బంది స్వాగతం పలికారు. పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తానని ఆమె ఈ సందర్భంగా మీడియాకు చెప్పారు. పట్టణంలో గంజాయి మత్తుపదార్థాలు సరఫరా కాకుండా చర్యలు తీసుకుంటానని, అలాగే ట్రాఫిక్ మెరుదలకు తన వంతు కషి చేస్తానని చెప్పారు.

సిఐగా బాధ్యతలు చేపట్టిన మంగాదేవి

త్వరగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి

పలు సమస్యలతో లబ్ధిదారుల అవస్థలు

సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ప్రజాశక్తి - ఆకివీడు

జిల్లా వ్యా ప్తంగా జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం తక్షణమే పూర్తి చేయించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం డిమాండ్ చేశారు. సిపిఎం కార్యాలయంలో పట్టణ కమిటీ సమావేశం పెంకి అప్పారావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి బలరాం హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు ఇచ్చిన జగనన్న ఇళ్ల కాలనీల్లో చాలామంది ఇళ్ల నిర్మాణం చేపట్టడం లేదన్నారు. ఆర్థిక ఇబ్బందులతో మధ్యలోనే నిర్మాణాలను నిలుపుదల చేస్తున్నారన్నారు. నిర్మాణాలు చేపట్టిన వారు లక్షల రూపాయల్లో అప్పుల పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారుల కష్టాలను దృష్టిలో పెట్టుకుని అర్హులందరికీ ఒక్కొక్కరికి రూ.ఆరు లక్షల నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఆర్భాటంగా ప్రారంభించిన జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కరువయ్యాయన్నారు. లబ్ధిదారులతో ఇళ్ల నిర్మాణం చేపట్టేలా ఒత్తిడి చేసిన ప్రభుత్వం కాలనీల్లో కనీస సౌకర్యాలు కల్పించడంలో ఏ మాత్రం దృష్టి పెట్టలేదని విమర్శించారు. ఆకివీడులో ఉన్న జగనన్న కాలనీలో వందల మంది ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి నివాసాలు ఉంటున్నారని, వారందరికీ తాగునీరు, డ్రెయినేజీ, వీధిలైట్లు, రోడ్లు వంటి సౌకర్యాలను కల్పించకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వచ్చే వేసవికాలం నాటికైనా కాలనీలో రోడ్ల నిర్మాణం పూర్తి చేసి మంచినీరు, డ్రెయినేజీ, విద్యుత్ సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పట్టణాల్లో గత ప్రభుత్వం చేపట్టిన టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తయినా రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు మంజూరు చేయలేదని విమర్శించారు. ఇప్పటివరకు టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వకపోవడం సరికాదన్నారు. లబ్ధిదారుల నుంచి లక్షల రూపాయల్లో డిపాజిట్లు కట్టించుకున్నారని, లబ్ధిదారులు అప్పుల పాలయ్యారని, వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని నిర్మాణం పూర్తయిన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెవివి.గోపాలన్ మాట్లాడారు. ఈ సమావేశంలో సిపిఎం పట్టణ కార్యదర్శి కె.తవిటినాయుడు, సభ్యులు డోకల లక్ష్మి, ఎస్‌కె.వలీ, డి.రవితేజ, బి.రాంబాబు, గోపిశెట్టి రాంబాబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ఒపిఎస్ అమలు చేసేవారికే ఓటు

యుటిఎఫ్ సభలో వక్తలు స్పష్టీకరణ - ఫిబ్రవరి నుంచి ఉద్యమ కార్యాచరణ - ఓట్ ఫర్ ఒపిఎస్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

రానున్న ఎన్నికల్లో పాత పెన్షన్ విధానం(ఒపిఎస్)ను అమలు చేసేవారికే ఓటు వేస్తామని యుటిఎఫ్ సభలో పలువురు వక్తలు స్పష్టం చేశారు. యుటిఎఫ్ ఆధ్వర్యంలో 'ఓట్ ఫర్ ఒపిఎస్' సభను తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఎస్‌కెవిటి డిగ్రీ కళాశాల ఆవరణలో ఆదివారం నిర్వహించారు. వేలాది మంది ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఈ సభకు తరలొచ్చారు.

ఈ కార్యక్రమంలో పిడిఎఫ్ ఎంఎల్ సి కెఎస్.లక్ష్మణరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పెన్షన్ భిక్ష కాదు హక్కు అని మరోసారి గుర్తు చేశారు. అనేక పోరాటాల ఫలితంగా ఉద్యోగులకు పెన్షన్ సౌకర్యం అమల్లోకి వచ్చిందన్నారు. ఉద్యోగులకు నష్టం వాటిల్లేలా సిపిఎస్‌ను ప్రభుత్వాలు తీసుకొచ్చాయన్నారు. రాష్ట్రంలో మూడు లక్షల మంది ఉద్యోగులకు సిపిఎస్ అమలువుతుందన్నారు. పాత పెన్షన్ విధానంపై రాజకీయ పార్టీలు తమ వైఖరి వెల్లడించాలని డిమాండ్ చేశారు. వైసిపి ప్రభుత్వం అమలుల్లోకి తెచ్చిన జిపిఎస్ కూడా సిపిఎస్ వంటిదేనని ఆయన స్పష్టం చేశారు.

మరో పిడిఎఫ్ ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సిపిఎస్, జిపిఎస్ తెచ్చిన వారిని ఓడించేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. యుటిఎఫ్ 50ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానాన్ని ఆయన గుర్తు చేశారు. ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమస్య పరిష్కారం కోసం ఉద్యమాలు చేస్తుంటే ప్రభుత్వం పోలీసుల సహకారంతో అణచితకు గురిచేస్తుందన్నారు. ఇది సరైన పద్ధతికాదన్నారు. ఉపాధ్యాయులను నేరస్తులుగా చూడటం తగదన్నారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మంతెన సీతారాం మాట్లాడుతూ పాత పెన్షన్ కోసం జరిగే పోరాటానికి సిపిఎం సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. రాష్ట్రంలో రాజకీయపార్టీలు ఎన్నికల ముందు హామీలు ఇవ్వడం గెలిచిన తరువాత కార్పొరేట్లకు సేవచేయడం ఆనవాయితీగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. యుటిఎఫ్ తలపెట్టిన పోరాటం విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్‌ఎస్.ప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన జిపిఎస్‌లో డొల్లతనాన్ని వివరించారు. గ్యారెంటీ లేని పెన్షన్‌కు గ్యారెంటీ పేరు పెట్టారని ఆయన ఎద్దేవా చేశారు. హిమాచల్ ప్రదేశ్‌లో అమలవుతున్న ఇలాంటి పెన్షన్ పథకం వల్ల అక్కడ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తా వించారు. ఫిబ్రవరి ఒకటి నుంచి ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతున్నామని, దీనికి ఉద్యోగులు, ఉపాధ్యాయులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఒపిఎస్‌ను మేనిఫెస్టోలో చేర్చడంతో పాటూ మొదటి సంతకంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

మాజీ ఎంఎల్‌సి ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ ఒపిఎస్ దేశ వ్యాప్త సమస్యగా మారుతోందన్నారు. వచ్చే ఎన్నికల్లో సిపిఎస్ రద్దు నినాదం దిశా నిర్దేశం చేస్తుందన్నారు. ఇపిఎఫ్-95 ఉద్యోగులకు ఇప్పటికీ కొదిపాటి పెన్షనే వస్తుందన్నారు. దీంతో వారు ఆర్థిక ఇబ్బందులతో నానా అవస్థలు పడుతూ జీవనం సాగిస్తున్నారన్నారు. ఓట్ ఫర్ ఒపిఎస్‌కు ఏ రాజకీయ పార్టీ నుంచీ మద్దతు లభించకపోతే శాసన సభలకు సొంతంగా ప్రతినిధులను పంపేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగాల్లో ఉన్న సిపిఎస్ బాధితుల వివరాలను సభ దష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఓట్ ఫర్ ఒపిఎస్ పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బి.కాంతారావు, సిపిఐ నాయకులు జ్యోతిరావు, ఆప్ రాష్ట్ర నాయకులు వై.శ్రీనివాసరావు, బిఎస్‌పి నాయకులు పట్నాల విజయ్‌కుమార్, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు మనోహర్, అరుణకుమారి, గోపి మూర్తి, జ్యోతిబసు, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.జయకర్, ఎస్‌కె.షరీఫ్, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు కొమ్మోజు శ్రీనివాసరావు, కె.సురేష్‌కుమార్, జివి.రమణ, హనుమంతరావు, ఉమాశంకర్, కుమార్ రాజా, లక్ష్మీరాజా, రెడ్డి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సభకు తరలొచ్చిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు

సభలో మాట్లాడుతున్న ఎంఎల్‌సి లక్ష్మణరావు

ఫిబ్రవరి నుంచి ఉద్యమ కార్యాచరణ

ఒపిఎస్ సాధనకు ఫిబ్రవరి నుంచి ఉద్యమ కార్యాచరణను యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్ వివరించారు. ఫిబ్రవరి 12 నుంచి మండల స్థాయిలో ఫిబ్రవరి 18 నుంచి 21 వరకూ నియోజకవర్గ స్థాయిలో ఫిబ్రవరి 25 నుంచి 28 వరకూ జిల్లా స్థాయిలో అన్ని రాజకీయపార్టీల నాయకులను కలిసి ఈ మేరకు వినతిపత్రాలు ఇవ్వాలని తెలిపారు. మార్చి నుంచి ఓట్ ఫర్ ఒపిఎస్ పేరుతో ప్రతి ఇంటికీ, వాహనాలకు స్టిక్కర్లు అంటించాలని అన్నారు. రాజకీయ పార్టీలు నిర్వహించే సభల్లో ఓట్ ఫర్ ఒపిఎస్ ఫ్లకార్డులను ప్రదర్శించాలన్నారు. మార్చి 15 తర్వాత చర్చావేదికలు, 26 నుంచి 30 వరకూ బైకు ర్యాలీలు నిర్వహించాలని కోరారు.

హోరెత్తిన రాజమహేంద్రవరం

యుటిఎఫ్ సభ నేపథ్యంలో ఉపాధ్యాయులు, ఉద్యోగుల నినాదాలతో రాజమహేంద్రవరం నగరం హోరెత్తింది. వివిధ ప్రాంతాల నుంచి ఉపాధ్యాయులు, ఉద్యోగులు వేలాది సంఖ్యలో ప్రదర్శనగా సభా స్థలికి చేరుకున్నారు. వేలాదిమంది మహిళా ఉపాధ్యాయులు ఈ సభకు తరలొచ్చారు. సిపిఎస్ రద్దు చేయాలని, ఒపిఎస్‌ను పునరుద్ధరించాలి, సిపిఎస్ ఇచ్చేవారికే మా ఓటు అంటూ నినదించారు.

ఎన్నికల్లో పోటీ చేస్తా..

మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు

ప్రజాశక్తి - నరసాపురం

2024 ఎన్నికల పోటీల్లో ఉంటానని మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు అన్నారు. ఆదివారం రాత్రి తన స్వగృహంలో కార్యకర్తలు, నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు వారాల్లో ఏ పార్టీలో చేరేదనేది ప్రకటిస్తానన్నారు. కార్యకర్తలు, నాయకులతో త్వరలో సమావేశం నిర్వహిస్తామని, కార్యకర్తలందరూ ఓటరు జాబితా తనిఖీ చేయాలన్నారు. నా వెన్నంటే ఉండే కార్యకర్తలు, నాయకులే తన బలమన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ చట్టంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - పాలకోడేరు

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ప్రజలకు నష్టం కలిగిస్తుందని, ఆ నష్టాల గురించి ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరమణారావు అన్నారు. ఆదివారం సాయంత్రం శృంగవృక్షం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తాము ఏ పార్టీకి, ఏ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేయటం లేదన్నారు. కేవలం ప్రజలకు నష్టం కలిగించే చట్టం రద్దు కోసమే, ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు ఉద్యమిస్తున్నామన్నారు. స్వాతంత్ర ఉద్యమ కాలం నుంచి ప్రజల కోసం పోరాటం చేసిన చరిత్ర న్యాయవాదులకు ఉందన్నారు. ప్రతి గ్రామంలోనూ గ్రామ సభ ఏర్పాటు చేసి చట్టం రద్దు కోసం తీర్మానించి తహశీల్దార్ నుంచి జిల్లా కలెక్టర్ వరకు తీసుకువెళ్తే చట్టం రద్దవుతుందన్నారు. సీనియర్ న్యాయవాది బొక్కా దామోదర్‌రావు మాట్లాడుతూ భూ వివాదాలు ఏర్పడినప్పుడు కోర్టులను ఆశ్రయించి న్యాయం పొందేవారమని, అయితే ఇప్పుడు ఈ చట్టం వల్ల న్యాయ పరిజ్ఞానం లేని అధికారులకు తీర్పులు చెప్పే అధికారం కలుగుతుందన్నారు. మరో న్యాయవాది కెవి.రమేష్ మాట్లాడుతూ ఈ చట్టాన్ని ఏర్పాటు చేయడం అన్యాయమన్నారు. జెఎసి కన్వీనర్ నీలాటి రమేష్ మాట్లాడుతూ రెండు నెలలుగా న్యాయవాదులు ఈ చట్టానికి వ్యతిరేకంగా సమ్మె చేస్తుంటే ప్రజలు తమ కోసం అనుకుంటున్నారని, అందుకే ప్రజలకు వివరించేందుకు తాము ఊరూరా సభలు పెట్టి అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ సదస్సులో బిజెపి నాయకులు కోరం ముసలయ్య, కురెళ్ల నరసింహారావు, సాగి సత్యనారాయణరాజు, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గులిపల్లి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సోము రామకృష్ణ, మహిళా న్యాయవాది అల్లం భాగ్యశ్రీ, బంటుమిల్లి కృష్ణ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల 1975 - 1979 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం సమ్మేళనమయ్యారు. వివిధ రంగాల్లో స్థిరపడి 44 ఏళ్ల తర్వాత కలిసిన వారు పాఠశాలతో ఉన్న అనుబంధాన్ని నెమరు వేసుకుని సరదాగా మాట్లాడుకున్నారు. అనంతరం తమ వంతుగా పాఠశాలకు తాగునీరు కోసం రూ.10 వేలు ఆర్థిక సహాయం, పదో తరగతిలో మెరిట్ విద్యార్థులకు ప్రోత్సాహకరంగా రూ.1500 ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పి.ఉషాకనుల, ఎం.చిత్రభాను, వి.సుజాత, ఎ.కృప, సిహెచ్.సరోజిని, ఎ.రాజేశ్వరి, ఎ.ఛాయాదేవి, జి.నాగవేణి, వి.రంగమణి, వై.నాగేశ్వరమ్మ పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత కుట్టు మిషన్లు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో దళిత జెఎసి ఆధ్వర్యంలో 40 మంది ఎస్‌సి, ఎస్‌టి, బిసి మహిళలకు రాజ్ ట్రస్ట్ అధ్యక్షుడు గంటా రాజ్‌కుమార్ సౌజన్యంతో ఆదివారం ఉచితంగా కుట్టుమిషన్లు అందించారు. వైసిపి పట్టణ అధ్యక్షులు తోట భోగయ్య, బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు కొడే యుగంధర్, చెల్లబోయిన సూర్యప్రకాష్ చేతుల మీదుగా వీటిని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద మహిళలకు ఉచితంగా కట్టుమిషన్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. రాజ్ కుమార్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో దళిత జెఎసి కన్వీనర్ యేలేటి న్యూటన్, పశుగణాభివృద్ధి సంస్థ డైరక్టర్ గంటా సుందర్‌కుమార్, విజేసెన్స్ కమిటీ మెంబర్స్ బాలకృష్ణ, కొర్రపాటి అనిత, చెరుకువాడ రంగసాయి, కంతేటి వెంకటరాజు, గాదిరాజు రామరాజు, బొత్స ధర్మ, కెసి.రాజు, రామకృష్ణవర్మ, కడలి శ్రీనివాస్, దుర్గ, కందికట్ల సాగరాజు పాల్గొన్నారు.

సూర్యనారాయణను సత్కరిస్తున్న ఆలయ ధర్మకర్తల మండలి, సిబ్బంది

ఆలయ ఇఒ సూర్యనారాయణకు సత్కారం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయం ప్రాంగణంలో ఇఒ యార్ల సూర్యనారాయణను శనివారం ఆలయ ధర్మకర్తల మండలి, సిబ్బంది, అర్చక స్వాములు ఘనంగా సత్కరించారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ ఉద్యోగి అవార్డు అందుకున్న సందర్భంగా ఆయనను సత్కరించారు. ఈ కార్యక్రమం ధర్మకర్తల మండలి ఛైర్మన్ కోరాడ శ్రీనివాస్ పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రేపాక వారి సత్రం ఫౌండర్ ఛైర్మన్ రేపాక వీర్రాజు, అన్నదాన కమిటీ సభ్యులు జంధ్యం ఉప్పరి, మాజీ ధర్మకర్త నాళం బాబి, ఎం.నరసింహస్వామి పాల్గొన్నారు.

అన్నదాన భవన నిర్మాణానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలోని కాళ్లకూరులో స్వయంభూ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో అన్నదాన భవన నిర్మాణానికి మహిళా భక్త బృందం ఆదివారం ఆర్థిక సాయం అందించారు. కాళ్లకూరు గ్రామానికి చెందిన యతిరాజుల ఆండాళ్ గోష్టి (మహిళా భక్త బృందం)అన్నదాన భవన నిర్మాణానికి రూ.50 వేలు స్వామివారి దేవస్థానం కార్యనిర్వహణాధికారి మోకా అరుణ్‌కుమార్‌కి అందించారు. ఆర్థిక సాయం అందించిన మహిళా భక్త బృందాన్ని దేవస్థానం ఇఒ అరుణ్‌కుమార్ అభినందించారు.

'జగన్‌ను ఓడించేందుకు జనం సిద్ధం'

ప్రజాశక్తి - ఆకివీడు

వచ్చే ఎన్నికల్లో జగన్‌ను ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎంఎల్ఎ మంతెన రామరాజు అన్నారు. ఇంటింటికి తెలుగుదేశం గడపగడపకు రాంబాబు కార్యక్రమం మండలంలోని అజమూరు గ్రామంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌కు కౌంట్ డౌన్ మొదలైందని, ప్రజాక్షేత్రంలో శిక్ష పడే సమయం ఆసన్నమైందన్నారు. ఎన్నికలకు తాము సిద్ధంగా ఉన్నామని వైసిపి నాయకులు చెప్తుంటే ఓడించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ప్రజలు అంటున్నారన్నారు. వైసిపి పాలనపై ఆపార్టీ నాయకులే విసుగెత్తి పోయారన్నారు. ఇప్పటికే ఆ పార్టీని ఆరుగురు ఎంఎల్ఎలు, నలుగురు ఎంపీలు వదిలిపెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ తెలుగు మండలాధ్యక్షులు ప్రసాద్, కార్యదర్శి నవకోట్ల రామారావు, ఆకివీడు పట్టణ అధ్యక్షుడు బొల్లా వెంకట్రావు, గంధం ఉమా సత్యనారాయణ, పార్టీ నాయకులు కౌన్సిలర్ నాగలక్ష్మి, అరుణకుమారి పాల్గొన్నారు.



ఆచంటలో అపారిశుధ్యం..!

వాటర్‌ట్యాంకులు శుభ్రం చేయని వైనం
పైపులైన్లకు లీకులు
తాగునీరు కలుషితం
ఇటీవల డెంగీతో యువకుడు మృతి
వైద్య శిబిరం ఏర్పాటు

ప్రజాశక్తి - ఆచంట

మండల కేంద్రమైన ఆచంటలో జ్వరాలు ఆందోళన కలిస్తున్నాయి. ఈ నెల 27వ తేదీన సజ్జ యేసు కుమారుడు సజ్జ శ్రీకాంత్ (29) డెంగీ జ్వరంతో మృతి చెందాడు. ఆచంటలో డెంగీ వదంతులు కలకలం సృష్టించాయి. ఈ నేపథ్యంలో వైద్య ఆరోగ్యశాఖాధికారులు, సర్పంచి కోట సరోజిని వెంకటేశ్వరరావు, పంచాయతీ సిబ్బంది అప్రమత్తమయ్యారు. దోమల వల్ల మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వంటివి వచ్చే ప్రమాదం ఉందని, ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ సత్యవతి సూచించారు.

అప్రమత్తమైన వైద్య సిబ్బంది

ఆచంట గ్రామంలో డెంగీ జ్వరాలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఆదివారం దోమల నివారణ చర్యలు చేపట్టారు. అధికారులు దగ్గరుండి పారిశుధ్య పనులతో పాటు గ్రామాల్లో బ్లీచింగ్ చల్లించారు. ఆచంట వేమవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని సత్యవతి ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఆశా కార్యకర్తలు, ఎఎన్ఎంలు ఇంటింటికీ తిరిగి సర్వే నిర్వహించి జ్వర పీడితులను గుర్తించి వైద్య శిబిరానికి తీసుకొచ్చి రక్త నమూనా పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో డ్రెయిన్‌లో పూడుకుపోయిన చెత్తను తొలగించి, వీధుల్లో బ్లీచింగ్ చల్లించారు. దోమల నివారణకు పిచికారీ చేయించారు. పరిసర ప్రాంతాల్లో టైర్లు, కొబ్బరిబండాలు, ప్లాస్టిక్ డబ్బాల్లో నిల్వ నీరు ఉండటంతో జ్వరాలు వ్యాప్తి చెందాయన్నారు. జ్వరాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేసి గ్రామస్తులకు వివరించినట్లు డాక్టర్ సత్యవతి తెలిపారు.

నీరు కలుషితం..రోగాల భయం

గ్రామాల్లో సురక్షిత తాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందుకోసం గ్రామీణ నీటి సరఫరా విభాగం జల భాండాగారాలను

మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

నిర్మించింది. తాగునీటి పథకాల నిర్వహణ బాధ్యతలను పంచాయతీలకు అప్పగించింది. ఇందుకు అనుగుణంగా తాగునీటి పథకాలతో పాటు గ్రామాల్లోని ట్యాంకులను సకాలంలో శుభ్రం చేయడం లేదు. ట్యాంకులను బ్లీచింగ్‌తో క్లోరినేషన్ చేస్తున్న దాఖలాలు కనిపించకపోవడంతో గ్రామాల్లో కలుషిత నీరు సరఫరా అవుతుంది. దీంతో గ్రామీణ ప్రాంత ప్రజలు వ్యాధుల బారిన పడి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పైపులైన్ల లీకులతో మురుగునీరు చేరుతుంది. ట్యాంకుల నిర్వహణను గాలికి వదిలేయడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శుభ్రతకు తిలోదకాలు

నిబంధనల ప్రకారం ప్రతి 15 రోజుకోసారి ట్యాంకులను శుభ్రం చేయాలి. సురక్షిత నీటి పథకాల్లో ఉన్న ఫిల్టర్ బెడ్‌ను రెండు నెలలకోసారి శుభ్రం చేయాలి. అనేక గ్రామాల్లో అలా చేయకపోవడంతో కుళాయిల ద్వారా అపరిశుభ్రమైన నీరు సరఫరా అవుతుంది. దీంతో ఆ నీటిలో బ్యాక్టీరియా చేరి ఆయా గ్రామాల్లో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. గ్రామాల్లో నీటి ట్యాంకులను శుభ్రపరిచి క్లోరినేషన్ తూతుమంత్రంగా చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

దోమల మందు పిచికారీ చేయిస్తున్న అధికారులు

నిర్వహణ గాలికి

గ్రామాల్లో తాగునీటి ట్యాంకుల నిర్వహణను అధికారులు గాలికి వదిలేశారు. దీని ఫలితంగా ప్రజలు కలుషిత నీరు తాగడం వల్ల అతిసారం, టైఫాయిడ్, కామెర్లు, నులిపురుగులు, థైరాయిడ్ వంటి రోగాల బారిన పడే ప్రమాదముంది. వీటికి తోడు చర్మ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. కొన్ని గ్రామాల్లో మురుగు నీటిలోనే కుళాయిలు దర్శనమిస్తున్నాయి. చుట్టూ ఎత్తైన పళ్లేలు ఏర్పాటు చేయాలని కోరుతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

శుద్ధి జలాలకు డిమాండ్

కుళాయిల ద్వారా కలుషిత నీరు సరఫరా కావడంతో ప్రజలు వీటిని తాగటానికి ఇష్టపడటం లేదు. గ్రామీణ ప్రాంతాల్లోని చాలామంది శుద్ధినీటిని కొనుగోలు చేసి తాగుతున్నారు. మండల కేంద్రంతో పాటు పలు


మహిళలతో మాట్లాడుతున్న అధికారులు

గ్రామాల్లో ప్రయివేట్ శుద్ధి జలాల కేంద్రాలు వెలిశాయి. గ్రామీణ ప్రాంతాల్లో సైతం తుది జలాలను తాగుతుండడంతో ఆయా కేంద్రాలకు డిమాండ్ పెరిగింది. దీనిని ఆసరా తీసుకుని వాటి నిర్వాహకులు అధిక ధరలకు నీటిని విక్రయిస్తూ జేబులు నింపుకుంటున్నారు.

తక్షణం శుభ్రం చేయిస్తాం
ఇఒపిఆర్‌డి టి.మూర్తిబాబు

గ్రామాల్లో నీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసేలా చర్యలు చేపడతామని ఇఒపిఆర్‌డి టి.మూర్తిబాబు తెలిపారు. నిబంధనల ప్రకారం ఆయా గ్రామ పంచాయతీలో కార్యదర్శులు ఎక్కడైనా ట్యాంకులను శుభ్రం చేయడం లేదని తమ దృష్టికి వస్తే తగిన చర్యలు తీసుకుంటాం. ప్రజలకు శుద్ధి జలాలను అందించడమే లక్ష్యంగా పని చేస్తాం.

వైద్య సిబ్బందిపై అధిక భారం

వైద్య సిబ్బందిని గ్రామ సచివాలయాల్లో విలీనం చేయడంతో అధిక భారం పడుతుంది. దీంతో అటు సచివాలయంలోనూ, ఇటు ఆరోగ్య శాఖలోనూ పని చేయాలంటే సిబ్బందిపై అధిక భారం పడుతుంది. సర్వే పేర్లతో అనేక యాప్‌ల ద్వారా వైద్య సిబ్బందిపై అధిక భారం పడటంతో వైద్య పరంగా ఏమి చేయలేని పరిస్థితి నెలకొంది. ఉన్నతాధికారులు స్పందించి వైద్య సిబ్బందిపై అధిక భారం తగ్గించాలని ఆచంట వేమవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సత్యవతి తెలిపారు.

ఉత్తమ డిఇఒ వెంకటరమణకు అభినందన

ప్రజాశక్తి - తణుకు రూరల్

ఉపాధ్యాయులకు దశ, దిశ నేర్పితూ తన అసాధారణ వ్యక్తిత్వం, ప్రతిభా పాటవాలతో జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ విద్యాశాఖను కొత్త పుంతలు తొక్కించారని ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు నేలపాటి వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి నల్లజర్ల వెంకటరాంప్రసాద్ అన్నారు. ఈ నెల 26న తేదీన గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టర్ చేతులమీదుగా నాలుగోసారి జిల్లా ఉత్తమ విద్యాశాఖాధికారి అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను వెంకటరమణ, వెంకటరాంప్రసాద్ అభినందించారు.

ఓటు వజ్రాయుధం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఓటు విలువ తెలియక చాలా మంది ఓటును వేయడం నిర్లక్ష్యం చేస్తున్నారని, ఓటు వజ్రాయుధమని, నిర్లక్ష్యం వద్దని భీమవరం టౌన్ రైల్వే స్టేషన్ మేనేజర్ కె.శ్రీనివాస్ అన్నారు. భీమవరం టౌన్ రైల్వే స్టేషన్ ఆవరణలో ఓటు హక్కు ప్రాముఖ్యత - వినియోగం అంశంపై అవగాహన, ప్రయాణికుల అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని రెవెన్యూ శాఖ, శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఓటును సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రయాణికులు కొలను ప్రభావతి (గుంటూరు), అర్.సూర్యకాంతం (విజయవాడ), వి.రాజబాబు (గుడివాడ) మాట్లాడుతూ సుస్థిర పాలకులను ఎన్నుకోవడానికి ఓటు వజ్రాయుధమన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి ఓటర్ చైతన్య ప్రతిజ్ఞ నిర్వహించి ఓటర్‌గా కర్తవ్యం విస్మరించరాదని, ఓటు ప్రతి పౌరుడు బాధ్యతగా వేయడానికి, వేయించడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే సూపర్‌వైజర్ ఎస్.రాము, ఎస్‌కె.చాన్‌బాషా, మల్లుల సీతారాంప్రసాద్, రైల్వే సిబ్బంది, ప్రయాణికులు పాల్గొన్నారు.

మన భవిష్యత్తును కాపాడుకోవాలి

కాళ్ల : ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకుంటే మన భవిష్యత్తును కాపాడుకోవచ్చని మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ అన్నారు. పెదఅమిరంలో మనఓటు మన భవిష్యత్తు మన బాధ్యత కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం నిర్వహించారు. కలిదిండి ఎఎంసి మాజీ ఛైర్మన్ నంబూరి వెంకటరామరాజు (తాడినాడ బాబు) ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు మాట్లాడుతూ ఓటు హక్కు మనకు రాజ్యాంగం కల్పించిన వరమని, దీనిని ప్రజలందరూ సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునేలా చైతన్య పరచాలని కోరారు. 2024లో ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. మన తలరాతను మార్చేది ఓటు హక్కు మాత్రమేనన్నారు. మనం వేసే ఓటు నోటుకు అమ్ముడుపోతే ఐదేళ్లు బాధపడాల్సి వస్తుందన్నారు. జిల్లాలోని టిడిపి, జనసేన, బిజెపి పార్టీలకు చెందిన రాజకీయ ప్రముఖులతో పాటు పలువురు రాజకీయ విశ్లేషకులు హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ తోట సీతారామలక్ష్మి, మాజీ ఎంఎల్ఎలు పులపర్తిరామాంజనేయులు(అంజిబాబు), వేటుకూరి వెంకట శివరామరాజు, జనసేన నాయకులు జుత్తిగ నాగరాజు, వేగేశ్న కనకరాజు సూరి, చెనుమల్ల చంద్రశేఖర్, విడివాడ రామచంద్రరావు, పత్సమట్ల ధర్మరాజు, మేకా ఈశ్వరయ్య, ఘంటసాల వెంకటలక్ష్మి, యిర్రింకి సూర్యారావు, కొత్తపల్లి నాగరాజు పాల్గొన్నారు.

యాత్రికులతో ముత్యాలమ్మ ఆలయం రద్దీ

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న బండి ముత్యాలమ్మ ఆలయం యాత్రికులతో ఆదివారం కిటకిటలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో బండి ముత్యాలమ్మ భజన సంఘం ఆధ్వర్యంలో పాడిన భక్తి పాటలు యాత్రికులను ఆకట్టుకున్నాయి. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కార్యనిర్వాహణాధికారి దెందుకూరి రామకృష్ణంరాజు పర్యవేక్షణలో సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఆదినారాయణ మృతి తీరని లోటు

నివాళులర్పించిన సిపిఎం నేతలు

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరు పంచాయతీ పరిధి పడమటపాలెం గ్రామానికి చెందిన సిపిఎంకు ఎనలేని సేవలు అందించిన సిపిఎం నేత జడ్డు ఆదినారాయణ (60) అనారోగ్యంతో ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. సుమారు 35 సంవత్సరాల నుంచి సిపిఎంకు ఎనలేని సేవలందించారని జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కవురు పెద్దిరాజు అన్నారు. తొమ్మిదో వార్డు సభ్యునిగా వార్డు అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ప్రజానాట్యమండలి కళాకారునిగా కూడా పార్టీకి పనిచేశారన్నారు. ఇటీవల అనారోగ్యానికి గురవడంతో

ఆదినారాయణ (ఫైల్)

భీమవరంలోని ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందారన్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. ఆయన మృతదేహానికి పార్టీ పతాకాన్ని కప్పి నివాళులర్పించారు. ఆదినారాయణకు భార్య కుమార్తె, నలుగురు కుమారులు, 11 మంది మనవళ్లు, మనవరాళ్లు ఉన్నారు. ఆదినారాయణ మృతదేహానికి ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ, ఉప సర్పంచి బి.నరసింహారావు పార్టీ నాయకులు యడ్ల చిట్టిబాబు, కొత్తపల్లి నాగరాజు, ఆదూరి సాంబమూర్తి, చిలకలపూడి నాగేశ్వరరావు, చల్లా శ్రీనివాస్, అడ్డాల బ్రహ్మాజీ నివాళులర్పించారు.

మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్‌కు విశేష స్పందన

ప్రజాశక్తి - పాలకొల్లు

ఛాంబర్స్ డిగ్రీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఆదివారం నిర్వహించిన ఛాంబర్స్ మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్-2024కు మంచి స్పందన వచ్చింది. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ఈ మెరిట్ స్కాలర్‌షిప్ టెస్ట్‌కు 486 మంది విద్యార్థులు హాజరయ్యారు. పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు ముఖ్యఅతిథిగా హాజరై పేపర్ విడుదల చేశారు. విద్యార్థి దశలో ఇంటర్ అత్యంత కీలకమైందని, ఇంటర్ తర్వాత వివిధ పోటీ పరీక్షలకు ఎంట్రన్స్ టెస్ట్‌లకు హాజరై తమ ప్రతిభను నిరూపించుకోవాల్సిన సమయం అని, అటువంటి విద్యార్థులకు ఈ స్కాలర్‌షిప్ టెస్ట్, తమ ప్రతిభ సామర్థ్యాన్ని తెలుసుకోవడానికి, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఈ టెస్ట్‌లో వచ్చిన మార్కులను బట్టి ఫీజులో రాయితీ ఇవ్వడం అభినందనీయమన్నారు. కళాశాల ఛైర్మన్ కెవిఆర్.నరసింహారావు ఈ ప్రతిభా పరీక్షకు విచ్చేసిన విద్యార్థులకు శుభాభినందనలు తెలిపారు. కళాశాల సెక్రటరీ కలిదిండి రామరాజు మాట్లాడుతూ యాజమాన్యం లాభోద్దేశంతో కాకుండా సేవ దృక్పథంతో విద్యార్థుల బహుముఖ ప్రజ్ఞావంతులుగా తయారు చేస్తూ వివిధ రంగాల్లో శిక్షణ ఇస్తూ విద్యార్థి భవిష్యత్తును తీర్చుదిద్దు తున్నామన్నారు. 2024లో కళాశాల స్వర్ణోత్సవాన్ని నిర్వహిం చుకోబోతున్నా మన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు, అడిషనల్ ఛైర్మన్ తట్టవర్తి కృష్ణమూర్తి, ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి దేవరపు లక్ష్మీనారాయణ, కళాశాల ట్రెజరర్ జల్లూరి రామలింగేశ్వరరావు, గవర్నింగ్ బాడీ మెంబర్స్ ఇనుకొండ రంగారావు, వట్టం గణేష్, విశ్వనాథరాజు, ఎస్.కామేశ్వరరావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ టి.ఓల్గా పాల్గొన్నారు.

రాజమండ్రి తరలిన ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - నరసాపురం

రాజమండ్రిలో జరుగుతున్న పాత పెన్షన్ సాధన సభకు నరసాపురం నుంచి యుటిఎఫ్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉపాధ్యాయులు తరలివెళ్లారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం.మార్కండేయ జెండా ఊపి బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్కండేయ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సర్వీస్ రెగ్యులర్ చేసి

రాజమండ్రి వెళ్తున్న ఉపాధ్యాయులు

పెన్షన్, గ్రాట్యుటీ సౌకర్యం కల్పించాలన్నారు. పాత పెన్షన్ అమలయ్యేవరకు యుటిఎఫ్ పోరాటం ఆగదన్నారు.

బాధిత కుటుంబాలకు చీఫ్ విప్ పరామర్శ

ప్రజాశక్తి - మొగల్తూరు

ఇటీవల మృతి చెందిన మునీశ్వరరావు కుటుంబ సభ్యులను ఆదివారం చీఫ్ విప్ ముదునూరి ప్రసాద్ రాజు పరామర్శించారు. మండలంలోని శేరేపాలెం గ్రామానికి చెందిన దుసనపూడి సూర్యారావు, తణుకుల కనకాచలం సతీమణి, శేరేపాలెం సర్పంచి తణుకుల మునేశ్వరరావు సతీమణి, మొగల్తూరు పంచాయతీ పరిధి పడమటిపాలెం గ్రామానికి చెందిన సిపిఎం నాయకులు జడ్డు ఆదినారాయణ, అంగన్వాడీ టీచర్ తోరం శేషకుమారి ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబసభ్యులను చీఫ్ విప్ ప్రసాదరాజు ఆదివారం కలిసి పరామర్శించి సానుభూతి తెలిపారు. ఆయనతో పాటు వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు, సర్పంచి కడలి సోంబాబు, తన్నీడి గిరి, కొత్తపల్లి బాబి, వేగి బాబి, పాల రాంబాబు, రంగశెట్టి ఏసు ఉన్నారు.

'బిసిలంతా ఐకమత్యంతో టిడిపిని గెలిపించాలి'

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో పట్టణ జయహో బిసి సమావేశాన్ని టిడిపి రాష్ట్ర కార్యదర్శి పి.నరసింహరావు బాబు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా అధ్యక్షురాలు, భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ బిసిలతో పాటు అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన సిఎం జగన్‌ని ఓడించడానికి జనం సిద్ధంగా ఉన్నారన్నారు. బిసిలంతా ఐకమత్యంతో టిడిపి, జనసేన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి పి.నరసింహరావుబాబు మాట్లాడుతూ బిసి సామాజిక తరగతికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుచేసి ఎటువంటి నిధులు ఇవ్వకుండా బిసిలకు అన్యాయం చేశారన్నారు. వచ్చేది టిడిపి, జనసేన ప్రభుత్వమేనన్నారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి వేండ్ర శ్రీనివాస్, ఉమ్మడి జిల్లా జనసేన కార్యదర్శి పట్టణ